త్వరలోనే గృహయోగం



ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

- ఏఎస్సార్ నగర్‌లో శరవేగంగా టిడ్కో హౌసింగ్ పనులు
- రహదారులు, డ్రైనేజీల నిర్మాణం
- చకచకా విద్యుత్ మీటర్ల ఏర్పాటు
- పెండింగ్ పనులు పూర్తిచేయాలని జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో ఇళ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అంతర్గత రోడ్లు, గ్రీనరీ, డ్రైనేజీలతోపాటు కాలనీకి వెళ్లే రోడ్డును కూడా నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటికీ బాత్రూంలో ఫిటింగ్స్, కిచెన్ ఫిటింగ్స్, పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తున్నారు. ఈ కాలనీలో 2508 పైగా ఇళ్లతో గృహ సముదాయం నిర్మించారు. వాటిలో సుమారు 134 ఇళ్లకు గురువారం విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారు. మిగిలిన వాటికి కూడా త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పనులు ఆలస్యమైనట్లు, త్వరలోనే పూర్తి చేయనున్నట్లు, వీలైతే వచ్చే వారంలో అన్ని బ్లాక్‌లను అందజేయగలమని కాంట్రాక్టర్, టిడ్కో అధికారులు తెలిపారు.

జీవీఎంసీ కమిషనర్ పర్యటన

ఏఎస్సార్ నగర్‌లో గురువారం ఉదయం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. వర్షాల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇక్కడ తాత్కాలిక నివాసాల్లో ఉంటున్న కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి ఆయన సూచించారు. పర్యటనలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పరామర్శ

అనంతరం ఏఎస్సార్ నగర్‌లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్, కంపా హనోకు పర్యటించి, నిసులను పరామర్శించారు. అధికారులకు సహకరిస్తే త్వరగా టిడ్కో ఇళ్ల పనులు పూర్తవుతాయని తెలిపారు. వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నందున కాలనీ వాసులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బందితో హనోకు మాట్లాడి త్వరగా మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, నానిబాబు, సన్నిబాబు, బాబూరావు, కారుకొండ రాజు, నేపాల్ శ్రీను, ఆదిలక్ష్మి, పలిశెట్టి గణపతిల, నల్లబోతు సతీష్, నాయుడు, సచివాలయం, జీవీఎంసీ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో ఇళ్ల పెండింగ్ పనులను పూర్తిచేయాలని ఆదేశిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



విద్యుత్ మీటర్ల విషయమై సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనోకు

క్లుప్తంగా

రూ.58 లక్షలతో అభివృద్ధి పనులు



44వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు రామచంద్రానగర్‌లో రూ.58 లక్షలతో సీసీ డ్రెయిన్లు, పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వీటికి గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో ఏఈ రమణమ్మ, వార్డు నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



సీతంపేటలో కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: ఇటీవల కురిసిన వర్షాలకు జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక ఒక ఇంటి గోడ కూలిపోయింది. ఈ మార్గంలో సీసీ డ్రెయిన్లు కొత్తగా నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో డ్రెయిన్‌ను ఆక్రమించిన నిర్మాణాలు తొలగించారు. వరుసగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి ప్రవాహ ధాటికి కింద నుంచి మట్టి కోరేయడంతో గోడ కూలినట్టు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు.

నేడు బోరు ప్రారంభం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో ఏర్పాటు చేసిన బోరును శుక్రవారం ప్రారంభించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్వీ సుధాకర్ తెలిపారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ దీనిని ప్రారంభిస్తారన్నారు. బోరును కార్పొరేటర్ ప్రసాద్ మంజూరు చేయించగా.. సబ్‌మెర్సిబుల్ పంప్ ఏర్పాటు, ఇతర కనెక్షన్లకు అవసరమైన రూ.46,000 ఆర్థిక సాయాన్ని వాకర్ కేజీ కృష్ణారావు దంపతులు అందించినట్లు వారు చెప్పారు.

గీతం ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలు

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబీఏ, బీబీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశాలకు గానూ విశాఖ ప్రాంగణంలో అడ్మిషన్ కౌన్సిల్‌ను నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర తెలిపారు. ఎంబీఏలో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, సప్‌లైచైన్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ ఎనలటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్‌లో స్పెషలైజేషన్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా 'నరవ'



నియామక పత్రం స్వీకరిస్తున్న నరవ ప్రకాశరావు

మద్దిలపాలెం: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఫిల్మ్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రెండు రోజులుగా హైదరాబాద్ సారథి స్టూడియోలో ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ సదరన్ రీజియన్ వార్షిక సమావేశం జరిగింది. ఆంధ్ర, తెలంగాణతోపాటు కర్ణాటక, పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు హాజరయ్యారు. పరిశ్రమతోపాటు ప్రేక్షకుల్లో వచ్చిన మార్పులపై చర్చించినట్టు నరవ తెలిపారు.

లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు

సీతంపేట: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేలా ఎన్నో సంక్షేమ పథకాలను రూపొందించి నేరుగా లబ్ధిదారులకే అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం 44వ వార్డు రామచంద్రానగర్‌లో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఇంటింటా ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్ రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పార్టీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, డైరెక్టర్ రాయుడు శ్రీను, వార్డు నాయకులు హబీబ్, హీర, వెంకటరావు, వాసు, గోపి, సీతారాం, రెడ్డి, కాయల రామారావు, ప్రసాద్, బషీర్, ముత్యాలు, తిరుపతి, బేగం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కొండవాలులో కె.కె.రాజు పర్యటన

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు నీలకంఠనగర్, శివలింగపురం, న్యూశ్రీనివాస్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాలు ప్రాంతాల్లోని ఇళ్ల రక్షణ గోడలు కూలడంతో జీవీఎంసీ అధికారులతో కలిసి వెళ్లి ఆయన పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

డ్రైనేజీలు, రోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలను వారికి దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పర్యటనలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఏఈ అర్చన, సాయి, సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యుడు సంపంగి శ్రీను, వార్డు నాయకులు సత్యనారాయణరెడ్డి, గంగరాజు, రాంబాబు, అప్పారావు, డి.శ్రీను, నరేష్, ఎల్.పార్వతి, ఆర్.లక్ష్మి, రమణమ్మ, దేవుడు ప్రశాంత్, వాసు, మణి, ఉమ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



శివలింగపురంలో కూలిన రక్షణ గోడను పరిశీలిస్తున్న కె.కె.రాజు, జీవీఎంసీ అధికారులు

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో పూజా రుసుము చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కనకమహాలక్ష్మి సన్నిధిలో భక్తులు

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

విద్యార్థులకు ప్రత్యేక వర్క్‌షాప్



విద్యార్థులతో ఏయూ ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉన్నత్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం సోషల్ వర్క్ విభాగంలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో ఏ విధమైన కార్యక్రమాలు నిర్వహించాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. యూబీఏ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.పావని మాట్లాడుతూ గ్రామాల్లో యూబీఏ నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలిపారు. విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎస్.హరనాథ్, పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్ కో ఆర్డినేటర్ ఎన్.సోని హవీల పాల్గొన్నారు.

ఆంధ్ర టెక్ లీగ్ పోస్టర్ విడుదల

ఏయూ క్యాంపస్: సాంకేతిక రంగంలో యువతను ప్రోత్సహించేలా ఆంధ్ర టెక్ లీగ్ నిర్వహిస్తున్నట్లు టెక్ టీం సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫైనల్ పోటీలు ఏయూ ఆ హబ్ వేదికగా అక్టోబర్ 1న జరుగుతాయన్నారు.

కలాం ఆశయాలు నెరవేరుద్దాం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భాగ్యశ్రీ, పాఠకులు

మురళీనగర్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ప్రపంచానికే ఆదర్శనీయుడని, ఆయన ఆశయాలను నెరవేరుద్దామని సచివాలయ మహిళా పోలీస్ అధికారి ఎం.భాగ్యశ్రీ పిలుపునిచ్చారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో గురువారం కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతంగా ఎదగాలని కలాం ఉద్బోధించేవారన్నారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయనకు ఇష్టమైన అధ్యాపక వృత్తిని కొనసాగిస్తూ విద్యార్థుల్లో ప్రేరణ కలిగించారన్నారు. ముందుగా కలాం చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.పద్మజ, పాఠకులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.53 వేల జరిమానా

ఒకరికి ఎనిమిది రోజుల జైలు శిక్ష

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి విశాఖ ఐదో మేజిస్ట్రేట్ రూ.53 వేల జరిమానా విధించారు. కొల్లపు సుధీర్ అనే వ్యక్తికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నగరంలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి.. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని, కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగులుస్తుందన్నారు. ప్రతి ఒక్క వాహన చోదకుడు మద్యం తాగకుండా నడపాలని సూచించారు.

కోతకు గురైన తీరం



అస్తవ్యస్తంగా తీర ప్రాంతం

బీచ్ రోడ్డు: భారీ వర్షాలకు సముద్ర తీరం కోతకు గురైంది. బీచ్‌లోని పిల్లల పార్కు, కొబ్బరి చెట్ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత గోడ భారీ అలలకు కొట్టుకుపోయింది. అలల ఉధృతికి ఇసుక మొత్తం కోరుకుపోయి తీర ప్రాంతం అస్తవ్యస్తంగా కనిపిస్తోంది.

వైభవంగా శ్రీవారి తిరుప్పావడ సేవ



ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన వివంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం శ్రీవేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి చిత్ర పటానికి ప్రత్యేక అలంకరణతో పాటు విశిష్ట పూజలు చేశారు. వివిధ రకాల పూలు, ఆహార పదార్థాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా బీవీకే కళాశాల విద్యార్థులతో చేపట్టిన శ్రీనివాస గద్య సమర్పణ విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్ట్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థల పరిశీలన

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం కోసం స్థల పరిశీలన జరిగింది. ఈ మేరకు గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక గణేష్‌నగర్ సచివాలయం పక్కన స్థలాన్ని పరిశీలించారు. బీటీఆర్ కాలనీలో ఇళ్ల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులతో వారు చర్చించారు. జోన్–3 కమిషనర్ విజయలక్ష్మి, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఏఈలు రహీం, ప్రభ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, కనకమహాలక్ష్మి దేవస్థానం పాలక మండలి సభ్యుడు సానబోయిన సురేష్, వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, హరికృష్ణ, వెంకటేష్, బొమ్మాళి రవి, గోవిందమ్మ, సన్నీ, అప్పన్న, గౌరినాయుడు, గ్రామ పెద్దలు సారిపిల్లి గంగరాజు, బోర గోవింద్, బోర శ్రీను, బోర వెంకటరమణ పాల్గొన్నారు.



గణేష్‌నగర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్, అధికారులు

కొండవాలు ప్రాంతాల సమస్యలపై వినతి

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు కోరారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు, జీవీఎంసీ కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారికి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మలకు వారు వినతిపత్రాలు అందించారు. ఊర్వశి కూడలి నుంచి బర్మాక్యాంప్, బాపూజీనగర్ వరకు మొత్తం కొండవాలు ప్రాంతం కావడంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాలులో మట్టి పెళ్లలు విరిగి పడుతుండటంతో నివాసులు భయాందోళనలకు గురవుతున్నారని వారికి వివరించారు. వార్డులో పర్యటించాలని, కొండవాలులో రిటైనింగ్ వాల్స్, బీటీ రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కవిత కోరారు.



జాయింట్ కలెక్టర్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

లలితాదేవి దుష్ట శిక్షణపై ప్రవచనం

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ప్రతి రోజూ సాయంత్రం శ్రీలలితా లహరి సప్తాహ ప్రవచన కార్యక్రమ జరుగుతోంది. శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని లలితాదేవి అమ్మవారి సేన ఆవిర్భావం, అమ్మవారు ఎలా దుష్టశిక్షణ చేసి తన బిడ్డలను రక్షించింది, సేనలోని వివిధ దేవతలను ఎలా ఉపాసించాలి, దాని ద్వారా ఎటువంటి సత్ఫలితాలు పొందవచ్చో భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు మాతాజీ చేతుల మీదుగా ప్రసాదం అందించారు. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ప్రవచన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని లలితాపారాయణ చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రవచిస్తున్న మాతా రమ్యానంద భారతీ

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ పరిధి 11 కేవీ టీపీటీ కాలనీ, 11 కేవీ వుడా కాంప్లెక్స్ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ, జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీపీటీ కాలనీ పరిధి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మురళీనగర్ సెక్షన్‌లో..

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు మురళీనగర్, సెక్టార్–5, బాలభాను పాఠశాల ఏరియా, బర్మా కాలనీ, మసీదు రోడ్డు, వర్మా కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ధ్యాన మందిరంలో వైద్య సేవలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం హారతి సమర్పించిన అనంతరం ప్రత్యేక అన్నదానం నిర్వహించారు. సాయంత్రం హారతి అనంతరం పల్లకీ సేవలో మహిళలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

ధ్యాన మందిర ప్రాంగణంలో కృష్ణా చిల్డ్రన్స్ హాస్పిటల్, కృష్ణా మెటర్నటీ నర్సింగ్ హోమ్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, పేదలు పాల్గొని పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ సిహెచ్.ఫణికృష్ణ, డాక్టర్ గోపి(పీడియాట్రిక్స్), డాక్టర్ తేజస్వి(గైనకాలజిస్ట్), డాక్టర్ శ్రీవల్లి(జనరల్ మెడిసిన్) వైద్య పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సాయివైష్ణవి(యుఎస్ఏ) భక్తులకు న్యూట్రిషన్, వ్యాయామం మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ధ్యాన మందిర కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న హాస్పిటల్ల సిబ్బంది

మ్యాన్‌హోళ్ల లీక్.. రోడ్డెక్కిన మురుగు



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డులోని పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు లీకవుతున్నాయి. మరికొన్ని చోట్ల ప్రమాదకరంగా మారాయి. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో షిర్డీసాయిబాబా దేవాలయ సమీపంలోని మ్యాన్‌హోల్ చుట్టూ రాళ్లు బయటకు రావడంతో వాహన చోదకులు ప్రమాదానికి గురవుతున్నారు. స్కూల్ వదిలే సమయంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ మార్గం పైకి వెళ్లే రోడ్డులో మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు నీరు ప్రవహిస్తోంది. దుర్వాసనతో స్థానికులు, పాదచారులు సతమతమవుతున్నారు. ఇక్కడి స్టేట్ బ్యాంక్ సమీపంలో పది రోజులుగా మ్యాన్‌హోల్ లీకై పొంగుతున్న పట్టించుకునే వారు లేరు. కార్లు, ఆటోలు మ్యాన్‌హోల్ పైనుంచి వెళ్తున్న సమయంలో మురుగు నీరు పాదచారులపైకి తుళ్లతోంది. మ్యాన్‌హోళ్ల మురుగుతో ఇబ్బందులు పడుతున్నామని, జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.